సాక్షి
ఒడిశా
మంగళవారం । 31 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,29,877లు, బంగారం 39.95 గ్రాములు, వెండి 80.5 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



గాంధీ మార్గం అనుసరణీయం

- 8లో



పార్టీకి తీరని లోటు

- 8లో

న్యూస్‌రీల్

నిరంజన్ పూజారికి ఆరోగ్యశాఖ బాధ్యతలు



నిరంజన్ పూజారి

భువనేశ్వర్: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ బాధ్యతలను ఆర్థికశాఖ మంత్రి నిరంజన్ పూజారికి కేటాయించారు. ఈ విభాగం మంత్రి నవకిషోర్ దాస్ తుపాకీ పేలుడుతో ఆదివారం ఆకస్మికంగా మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న నిరంజన్ పూజారికి అదనంగా ఆరోగ్యశాఖ కేటాయిస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం సోమవారం ప్రకటించారు. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ ఆమోదం లభించింది.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అగ్ని ప్రమాదాల నియంత్రణపై మహిళలకు వివరిస్తున్న అధికారులు

బరంపురం: నగరంలోని లంజిపల్లి 42వ వార్డు గొయిలండి ప్రాంగణంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రమాదాల నియంత్రణపై అవగాహ శిబిరం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఏవిధంగా రక్షణ పొందుతూ ఆపద నుంచి తప్పించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో అధికారులు, బీజేడీ జిల్లాశాఖ కార్యదర్శి సురేంద్ర మహరణ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ వలలో భూ పరిరక్షణాధికారి



అధికారి ధనుర్జయ ధుబా

రాయగడ: పొరుగు జిల్లా కలహండి లోని తువాముల్ రాంపూర్‌లో భూ పరిరక్షణ శాఖ కార్యాలయంలో ఓవర్ సీడ్‌గా విధులు నిర్వహిస్తున్న ధనుర్జయ ధుబా విజిలెన్స్ వలకు చిక్కుకున్నాడు. అతని నుంచి విజిలెన్స్ అధికారులు రూ.35 వేల నగదును స్వాధీనం చేసుకుని, దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే.. మనోరేగ పనుల్లో భాగంగా ఓ లబ్ధిదారుడి పెండింగ్ బిల్‌ను మంజూరు చేసేందుకు అధికారి రూ.35 వేలను డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బాధితుడు విజిలెన్స్ శాఖను ఆశ్రయించాడు. స్పందించిన కొరాపుట్ విజిలెన్స్ అధికారులు సోమవారం ఉదయం తువాముల్ రాంపూర్‌లోని గాంధీ కూడలి వద్ద నగదు తీసుకుంటున్న ధనుర్జయను పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు.

సెంచూరియన్‌లో రక్తదాన శిబిరం



శిబిరంలో పాల్గొన్న రక్తదాతలతో యూత్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు

పర్లాకిమిడి: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సెంచూరియన్ వర్సిటీ ఆవరణలో యూత్ రెడ్‌క్రాస్ విద్యార్థులు సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా మెడికల్ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ పండా శిబిరాన్ని ప్రారంభించగా, ప్రభుత్వ మెడికల్ సీనియర్ ఫార్మసిస్టు బెహరా, సిబ్బంది సహకరించారు. ఇందులో 111 విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వర్సిటీ స్టూడెంట్ కార్యకలాపాల అధికారి డాక్టర్ సుశాంతకుమార్ పట్నాయక్, స్కూల్ ఆఫ్ మేనేజిమెంట్ ప్రతినిధులు దాతలను అభినందించి, ప్రశంసాపత్రాలు అందించారు.

కార్యాలయానికి తాళం వేసిన గ్రామస్తులు

మల్కన్‌గిరి: స్థానిక సమితిలోని గొడిగూడ గ్రామస్తులు పంచాయతీ కార్యాలయానికి సోమవారం తాళం వేశారు. ప్రధానమంత్రి గృహ నిర్మాణ పథకంలో చోటు చేసుకున్న అవకతవకలపై అధికారులు స్పందించక పోవడంతోనే ఈ విధంగా చేశామన్నారు.

నాయకా.. సెలవిక



చితి చుట్టూ గుమిగూడిన అభిమానులు, నాయకులు



అభిమానుల మధ్య సాగుతున్న నవకిషోర్ దాస్ అంతిమయాత్ర(ఇన్‌సెట్లో) దాస్(ఫైల్‌ఫొటో)

- అధికారిక లాంఛనాలతో మంత్రి నవకిషోర్ దాస్ అంత్యక్రియలు
- స్వస్థలం ఝార్సుగుడకు భారీగా తరలివచ్చిన అభిమానులు
- నివాళులర్పించిన గవర్నర్ గణేషీలాల్, సీఎం నవీన్, మంత్రులు, ఎమ్మెల్యేలు
- రాష్ట్రంలో 3 రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన ప్రభుత్వం



శవ పేటికను శ్మశాన వాటికకు తరలిస్తున్న నాయకులు, అభిమానులు



మంత్రికి గన్ సెల్యూట్ చేస్తున్న పోలీసు బలగాలు



ప్రభుత్వ క్వార్టర్స్‌లో భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



తన భర్త మృతదేహం ముందు విలపిస్తున్న మినతి దాస్

భువనేశ్వర్: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి, ఝార్సుగుడ నియోజకవర్గ ఎమ్మెల్యే నవకిషోర్ దాస్ పంచభూతాల్లో విలీనమయ్యారు. ఖెరువాల్ శ్మశానవాటికలో నిర్వహించిన అంత్యక్రియల్లో ఆయన కుమారుడు విశాల్‌దాస్ చితికి నిప్పంటించారు. స్వస్థలం ఝార్సుగుడలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఝార్సుగుడ జిల్లా పోలీసు సూపరింటిండెంట్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రభుత్వ లాంఛనాలతో ఈ ఘట్టం ముగిసింది. ఈ సందర్భంగా గార్డ్ ఆఫ్ హానర్ ప్రదానం చేశారు. శ్మశానవాటిక ప్రాంగణంలో జాతీయ పతాకం పాక్షికంగా అవనతం చేశారు. ప్రభుత్వ ప్రతినిధులుగా ముగ్గురు కేబినెట్ మంత్రులు హాజరయ్యారు. ఝార్సుగుడ బెహ్రామల్ కిషాన్ ఛక్ నుంచి అంతిమ యాత్ర ఊరేగింపు నిర్వహించారు. ఈ యాత్రలో ఆయన అభిమానులు, బీజేడీ శ్రేణులు, ప్రజలు పాల్గొని, తమ ఆరాధ్య నేతకు నివాళులర్పించారు. మరోవైపు మంత్రి మృతిపట్ల ప్రభుత్వం 3 రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. అలాగే ఈనెల 31వరకు అధికారిక కార్యక్రమాలను రద్దు చేసింది. నవకిషోర్ దాస్ గౌరవార్థం 2 రోజుల పాటు జాతీయ జెండాను పాక్షికంగా అవనతం చేస్తారు.

పకడ్బందీగా పోస్టుమార్టం

భువనేశ్వర్ క్యాపిటల్ ఆస్పత్రిలో మంత్రి కిషోర్‌దాస్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఇద్దరు వైద్య నిపుణుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించారు. ఈ సమగ్ర ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయగా, ఆదివారం రాత్రి 11.30 గంటలకు ముగిసింది.

అసెంబ్లీ ఆవరణలో అంతిమ దర్శనం..

పోస్టుమార్టం అనంతరం మంత్రి పార్థివదేహాన్ని రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణానికి సందర్శనార్థం తరలించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఇక్కడ దివంగత మంత్రి పార్థివదేహం కడచూపుతో అంతిమ వీడ్కోలు పలికారు. ఇక్కడి నుంచి మంత్రి క్వార్టర్స్‌కు తీసు కు వెళ్లి, రాత్రంతా అక్కడే ఉంచారు. సోమవారం ఉదయం బిజూ జనతాదళ్ రాష్ట్ర కార్యాలయానికి తరలించి, పార్టీ కార్యకర్తలు, సాధారణ ప్రజానీకానికి అంతిమ దర్శనానికి అవకాశం కల్పించారు.

ఉద్దేశ పూర్వకంగానే గురి!

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిషోర్ దాస్ హత్యవెనుక గల కారణాలపై ఒడిశా క్రైమ్ బ్రాంచ్ బృందం దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనకు సంబంధించి బ్రజరాజ్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్(ఇన్‌చార్జి ప్రద్యుమ్న స్వాయి ప్రాథమిక సమాచార నివేదిక(ఎఫ్ఐఆర్) దాఖలు చేశారు. ఇందులో ఘటనా క్రమంతో నిందితుల వివరాలు పేర్కొన్నారు. ఏఎస్ఐ గోపాల్‌కృష్ణ దాస్ హతమార్చాలనే స్పష్టమైన ఉద్దేశంతోనే మంత్రిపై కాల్పులు జరిపినట్లు ప్రాథమికంగా నమోదు చేశారు. 'ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిషోర్ దాస్ గాంధీ చౌక్‌లోని లిఫ్ట్ అండ్ షిఫ్ట్ బిల్డింగ్‌లో బ్రజరాజ్ నగర్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఆదివారం మధ్యాహ్నం 12:15 గంటలకు విచ్చేశారు. వేదిక సమీపంలో ఆగిన కారు ముందు వైపు సిబ్బంది తలుపు తెరిచిన తర్వాత కిందికి దిగారు. ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం మోహరించిన ఏఎస్ఐ గోపాల్ కృష్ణదాస్ వెనువెంటనే తలుపు వద్దకు వచ్చి, చంపాలనే స్పష్టమైన ఉద్దేశంతో మంత్రిని లక్ష్యంగా చేసుకుని చాలా సమీపం నుంచి తన సర్వీస్ రివాల్వర్‌తో గురిపెట్టి కాల్పులు జరిపాడు. బుల్లెట్లు మంత్రి ఛాతికి తగలడంతో ఆయన కింద పడిపోయార'ని పేర్కొన్నారు.

ఐఐసీ వేలికి గాయం..

ఈ కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన బ్రజరాజ్ నగర్ ఐఐసీ, రాంపూర్ పోలీస్ అవుట్‌పోస్ట్ కానిస్టేబుల్ కేసీ ప్రధాన్‌తో కలిసి నిందితుడు గోపాల్‌దాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి తప్పించుకునేందుకు నిందితుడు 9 ఎంఎం పిస్టల్ నుంచి మరో రెండు రౌండ్ల బుల్లెట్లను కాల్చాడు. దీంతో బ్రజరాజ్ నగర్ ఐఐసీ ప్రద్యుమ్న స్వాయి త్రుటిలో తప్పించుకోగా, వేలికి గాయం తగిలింది. ఈ పరిస్థితుల్లో కాశీనగర్‌కు చెందిన జీబన్‌లాల్ నాయక్ అనే మరో వ్యక్తి కూడా గాయపడ్డాడు. కొంత పెనుగులాట తరువాత నిందితుడి నుంచి ఎట్టకేలకు రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలతో దాఖలైన ఫిర్యాదు ఆధారంగా ఐపీసీ సెక్షన్ 307, ఆయుధ చట్టంలోని 27(1) కింద కేసు నమోదు చేశారు.

50కి పైగా ప్రశ్నలు..

మీడియా ప్రతినిధులతో మాట్లాడిన క్రైమ్ బ్రాంచ్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు(ఏడీజీ) అరుణ్ బొత్రా నిందిత ఏఎస్ఐ గోపాల్ కృష్ణదాస్ ఆదివారం ఘటనా స్థలంలో పట్టుబడినట్లు తెలిపారు. మంత్రి నవకిషోర్ దాస్‌పై తుపాకీతో పేల్చడం వెనక పరిస్థితులను స్పష్టం చేసే దిశలో దర్యాప్తుకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు స్పష్టంచేశారు. కాల్పుల ఘటనపై తదుపరి విచారణ కోసం నిందితుడికి ఏడు రోజుల రిమాండ్ నిమిత్తం కోర్టుకు అభ్యర్థించనున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించింది. సుందర్‌గఢ్ పోలీసు బ్యారక్‌లో నిర్బంధించి నిందిత ఏఎస్ఐ గోపాల్‌దాస్‌ను నిరవధికంగా 2 గంటల పాటు ప్రశ్నించారు. 50కి పైగా ప్రశ్నలు వేసినట్లు సమాచారం. అయితే ఆయన ఏం మాట్లా డారు? ఏం సమాధానం చెప్పాడు? ఎందుకు చంపాడనే విషయాలేవీ తెలియరాలేదు. అరుణ్ బొత్రా సైతం మీడియా ఎదుట పెదవి దాటకుండా జాగ్రత్త వహించారు.

హైకోర్టు న్యాయమూర్తితో విచారణ..

మంత్రి నవకిషోర్ దాస్ హత్య ఘనను హైకోర్టు న్యాయ మూర్తితో విచారణ జరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర హైకోర్టుకు లేఖ రాసింది. మంత్రి నవకిషోర్ దాస్ హత్యా ఘటనపై విచారణకు సిట్టింగ్ లేదా రిటైర్డ్ న్యాయమూర్తిని పేర్కొవాలని సోమవారం రాసిన లేఖలో అభ్యర్థించింది.

నన్ను మాత్రం వదులుతారా?



ఝార్సుగుడ మున్సిపాలిటీ లో మంత్రి చివరి ప్రసంగం

ఆరోగ్యమంత్రి నవకిషోర్ దాస్ మరణానికి కొద్ది సమయం ముందు ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక్కడి ప్రసంగంతో ఆయన జీవన ప్రస్థానం ముగిసింది. ఝార్సుగుడ మున్సిపాలిటీ ఒకటో నంబరు వార్డు కిసాన్‌పాడులో మైక్రో యాక్టివిటీ సెంటర్ ప్రాంగణంలో కొత్త భవనం ప్రారంభోత్సవంలో చివరి సారిగా ప్రసంగించారు. ఈ సమావేశంలో మంత్రి అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ప్రతి చోటా ఆదరించే వారు ఉంటారు.. కించపరిచే వారూ.. ఉంటారు. రాముడు-రావణుడు, కృష్ణుడు-కంసుడు ఈ కోవకు చెందిన వార'ని ఉదహరించారు. 'సీతారాములను కించపరచకుండా వదలని ప్రజానీకం మధ్య మనుగడ కొనసాగిస్తున్న నన్ను మాత్రం ధూషించకుండా వదులుతారా?' అని చమత్కరించి సభలో నవ్వులు కురిపించారు. ఈ కార్యక్రమం హాజరయ్యే ముందు తుపాకీ తూటాతో కుప్పకూలి అనంత విషాదం మిగిల్చారు.

కలిసిరాని పూజ!



శని శింగనాపూర్ శనిదేవుని మందిరంలో మంత్రి నవకిషోర్ దాస్ పూజలు(ఫైల్)

త్రివేణి అమావాస్య సందర్భంగా మహారాష్ట్ర శని శింగనాపూర్‌లో ఉన్న శనిదేవుని మందిరంలో మంత్రి కిషోర్‌దాస్ బంగారు కలశం విరాళంగా అందజేసి ఇటీవల వార్తలకెక్కారు. రూ.కోటి విలువైన 700 గ్రాముల బంగారం, 5కిలోల వెండితో చేసిన కలశాన్ని ఆలయానికి సమర్పించారు. అయితే ఈ కలశం విలువ కేవలం రూ.10 లక్షలు మాత్రమేనని మంత్రి ప్రకటించారు. ఈ కలశం ఆవ నూనెతో శని భగవానునికి అభిషేకించేందుకు వినియోగించేందుకు అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర, ఝార్సుగుడ ప్రజలను సంతోషంగా ఉంచాలని శని దేవుడిని ప్రార్థించానన్నారు.

గవర్నర్, ముఖ్యమంత్రి చివరి చూపు..



కిషోర్‌దాస్‌కు పుష్పగుచ్ఛంతో శ్రద్ధాంజలి ఘటిస్తున్న గవర్నర్ గణేషీలాల్

దివంగత మంత్రి నవకిషోర్ దాస్ స్థానిక యూనిట్-5 అధికారిక నివాస ప్రాంగణంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ అంతిమ దర్శనం చేసుకుని పుష్పగుచ్ఛంతో నివాళులర్పించారు. ఈ ప్రాంగణంలో దాస్‌కు ఒడిశా పోలీసులు గార్డ్ ఆఫ్ హానర్ ప్రదానం చేశారు. అతున్ సవ్యసాచి నాయక్, పట్టణాభివృద్ధి శాఖమంత్రి ఉషాదేవి, న్యాయశాఖ మంత్రి జగన్నాథ్ సరకా, విద్యుత్‌శాఖ మంత్రి ప్రతాప్ కేశరీదేవ్, జల వనరులశాఖ మంత్రి టుకుని సాహు, ఎక్సైజ్‌శాఖ మంత్రి అశ్వినీకుమార్ పాత్రొ, నైపుణ్య అభివృద్ధి, సాంకేతిక విద్యాశాఖ మంత్రి ప్రీతిరంజన్ ఘొడై, జౌళీ, హస్తకళల శాఖమంత్రి రీతా సాహు, పాఠశాలలు, సామూహిక విద్యాశాఖ మంత్రి సమీర్‌రంజన్ దాస్ ఈ ప్రాంగణంలో దివంగత మంత్రికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆరోగ్యశాఖ మంత్రి నవకిషోర్ దాస్ మరణం దురదృష్టకరమని వీరంతా విచారం వ్యక్తం చేసి, ఆయన కుటుంబీకుల పట్ల ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

విధుల నుంచి తొలగింపు..



గోపాల్ కృష్ణదాస్, ఏఎస్ఐ

ఆరోగ్యశాఖ మంత్రి కిషోర్ దాస్ హత్యకేసులో నిందితుడు సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్(ఏఎస్ఐ) గోపాల్‌కృష్ణ దాస్‌ను క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఘటనా స్థలంలోనే అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఝార్సుగుడ జిల్లా ఎస్పీ రాహుల్‌జైన్ సోమవారం ప్రకటించారు. నిందితుడు బ్రజరాజ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ ఛక్ అవుట్‌పోస్టు సిబ్బందిగా పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 311 ప్రకారం సర్వీసులో ఉన్న నిందితునికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఉత్తర్వులు ఈనెల 30నుంచి అమలైనట్లు పరిగణిస్తామన్నారు.

ప్రసారాలను ఖండించిన ఏడీజీ



క్రైమ్ బ్రాంచ్ ఏడీజీ అరుణ్ బొత్రా

నిందితుడు గోపాల్ కృష్ణదాస్ గతంలో ఆరోగ్యశాఖ మంత్రి వ్యక్తిగత భద్రతా అధికారి(పీఎస్ఓ)గా పని చేశారన్న కథనాలను ఏడీజీ అరుణ్ బొత్రా ఖండించారు. అలాగే మంత్రి ఛాతీపై కాల్పులు జరిపడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మరణించారని వచ్చిన వార్తల్లో వాస్తవం లేదన్నారు. భువనేశ్వర్ ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో అరుణ్ బొత్రా, ఇంటెలిజెన్స్ డైరెక్టర్ సంజీబ్ పండా, ఉత్తర రేంజ్ ఆర్డీసీ దీపక్ కుమార్, ఝార్సుగుడ ఎస్పీ రాహుల్ జైన్ పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

కొరాపుట్: కొరాపుట్, నవరంగ్‌పూర్ జిల్లాల్లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్ సెల్‌కు వినతులు వెల్లువెత్తాయి. నవరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా హాజరై, దివ్యాంగులకు 3 బస్‌పాసులు, వీల్ చైర్, 10 గుర్తింపు కార్డులు, ముగ్గురికి దివ్యాంగ రుణ అనుమతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్.సుశ్రీ పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా నారాయణపట్న సమితిలో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తార్, జిల్లా ఎస్పీ అభినవ శంకర్ హాజరై, ప్రజా వినతులు స్వీకరించారు.

పర్తాదలో స్పందన..

పర్లాకిమిడి: కాశీనగర్ బ్లాక్ పర్తాడ పంచాయతీ కార్యాలయంలో జిల్లా గ్రీవెన్స్ కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ అధ్యక్షతన జరిగింది. ఇందులో 132 వినతులు అందాయి. అనంతరం పర్తాడ పంచాయతీ జోడూరులో మహిళా స్వయం సహాయక గ్రూపులు నిర్వహిస్తున్న బాయిలర్ కోళ్ల యూనిట్‌ను కలెక్టర్ లింగరాజ్ పండా, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గిరీష్ మహంతి పరిశీలించారు.

ఘనంగా బలిజాత్రో వేడుకలు



మాట్లాడుతున్న కలెక్టర్ కమలోచన్ మిశ్రా

జయపురం: సబ్ డివిజన్ బొరిగుమ్మలో మూడేళ్లకోసారి జరిగే మాఘగండయ్ బలిజాత్రో అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా ఆదివారం సాయంత్రం ముగిసింది. 9రోజుల క్రితం ప్రారంభమైన ఉత్సవంలో భాగంగా సమీపంలోని నది నుంచి యువతులు బుట్టలలో ఇసుక సేకరించి, బలి గృహానికి చేర్చారు. ఇంటి నుంచి తీసుకు వచ్చిన విత్తనాలను బుట్టలో చల్లారు. పూజారులు ప్రత్యేక పూజలు చేయగా, సంప్రదాయ నృత్యాలు, నైవేద్యాలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

క్లుప్తంగా

12న సెంచూరియన్‌లో పాటల పోటీలు



సమావేశంలో పాల్గొన్న చైతన్య సాహితీ సంస్కృతి సమితి సభ్యులు

పర్లాకిమిడి: చైతన్య ఆంధ్రసాహితీ సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న సెంచూరియన్ వర్సిటీలో జరుగనున్న ఘంటసాల ఆరాధన ఉత్సవాలకు సంబంధిదంచి సన్నాహక సభ పట్టణంలోని కోమటివీధిలో సోమవారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు బర్నాల జగన్నాథరావు, సలహాదారు వీఎస్ఎన్ రాజు, కోశాధికారి పాట్నూరు హరి, కార్యవర్గ సభ్యులు పాల్గొని, ఏర్పాట్లపై చర్చించారు. ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి సెంచూరియన్ వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో పాటల పోటీలు జరుగనున్నట్లు వెల్లడించారు. ఇందులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు కనీసం 2 ఘంటసాల పాటలు పాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రవేశ రుసుం రూ.300లు చెల్లించి, ఫిబ్రవరి 11లోగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అదేరోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, విజేతలకు బహుమతుల పంపిణీ చేపట్టనున్నట్లు వివరించారు. సమావేశంలో కళింగ మహిళా మండలి అధ్యక్షురాలు కోట్ని శోభారాణి, ఎస్.లత, వైశ్యరాజు రాధిక, పి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన ఇరా మహంతి ఆర్కెస్ట్రా



ఆకట్టుకున్న ఇరా మహంతి ఆర్కెస్ట్రా

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో వంశధార వసంతోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయకురాలు ఇరా మహంతి ఆర్కెస్ట్రా ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ఆధునిక, పాశ్చాత్య పాటలతో పాటు భక్తిగీతాలు పాడి ఆనందింపజేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అలాగే మహంతి బృందానికి నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

కొండ దిగిన ఏనుగుల గుంపు



భామిని: దిమ్మిడిజోల-లోవగూడ సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

భామిని: ఏనుగుల గుంపు కొండెక్కిందనే ఆనందం రైతులకు ఎక్కువ రోజులు మిగలలేదు. తివ్వాకొండలపై నుంచి ఏనుగుల గుంపు సోమ వారం కిందకు దిగింది. భామిని మండలం దిమ్మిడిజోల-లోవగూడ మధ్య తిష్టవేశాయి. లోవగూడ సమీపంలోని దిమ్మిడిజోలకు చెందిన రైతు వలరౌతు వెంకటరమణ చెరకుతోటను ధ్వంసం చేశాయి. ఏనుగుల గుంపు సంచారాన్ని అటవీశాఖ అధికారులు పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం



- ఆర్‌బీకేల ద్వారా సేకరణ మళ్లీ ప్రారంభించాం
- జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: జిల్లాలో రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని, ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలును తిరిగి ప్రారంభించామని జేసీ మయూర్‌అశోక్ సోమవారం చెప్పారు. పౌర సరఫరాల కార్పొరేషన్ ద్వారా రూపొందించిన యాప్ ఆధారంగా రైతుల వద్ద లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. చిన్న, సన్నకారు రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యం సేకరణకు తొలి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు రైతుల నుంచి 500 ఆర్‌బీకేల ద్వారా 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. బిల్లుల రూపంలో రూ.422 కోట్లను చెల్లించినట్టు వెల్లడించారు.

వెండిబిళ్లపై మహాత్ముడి ముఖ చిత్రం



రాజాం సిటీ: రాజాం పట్టణంలోని కస్పావీధికి చెందిన మైక్రో ఆర్టిస్టు, స్వర్ణకారుడు ముగడ జగదీష్ జాతిపిత మహాత్మా గాంధీ ముఖచిత్రాన్ని 3.130 మిల్లీ గ్రాముల వెండిపై 70 నిమిషాలలో చెక్కి అబ్బుర పరిచాడు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన ముఖచిత్రాన్ని చెక్కినట్టు తెలిపాడు.

గాంధీ మార్గం.. అనుసరణీయం

- జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులర్పించిన నాయకులు

బరంపురం: జాతిపిత మహాత్మాగాంధీ ఆదర్శాలను అంతా పాటించాలని, ప్రపంచ శాంతికి ఆయన చూడిన మార్గం అనుసరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం గాంధీ వర్ధంతి సందర్భంగా గంజాం కాంగ్రెస్, గంజాం వికాస పరిషత్, బహుముఖి సమాజ్, సర్ద్రాపటేల్ సమాజ్ తోపాటు వివిధ సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని గాంధీనగర్ మెయిన్ రోడ్డు జంక్షన్‌లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

జాతిపిత స్మరణలో..

కొరాపుట్: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి నేపథ్యంలో నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. బాపూజీ సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి, మాజీ ఎమ్మెల్యే సదానాయక్ పాల్గొన్నారు. నవరంగ్‌పూర్ కలెక్టరేట్ వద్ద జరిగిన సంస్మరణ కార్యక్రమంలో పరిపాలన, రెవెన్యూ శాఖ ఉద్యోగులు పాల్గొని, మౌనం పాటించారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి గాంధీ భవన్‌లో

పర్లాకిమిడి: పట్టణంలోని తెలుగు సోండి వీధి వద్ద కాంగ్రెస్ భవనంలో డీసీసీ అధ్యక్షుడు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గమాంగో ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బసంతపండా, మాజీ కౌన్సిలర్ అభిమన్యు పండా, యువజన కాంగ్రెస్ నాయకులు సూర్యనారాయణ పాత్రో, సంగ్రాం సాహు, గుమ్మా, కాశీనగర్‌కు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

గుణుపూర్‌లో సహీద్ దినోత్సవం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో సహీద్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బస్టాండ్ సమీపంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే రఘునాథ్ గమంగొ, మున్సిపాలిటీ చైర్మన్ మమత గౌడా, వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడా, తహసీల్దార్ శరత్‌చంద్ర నాయక్ పాల్గొన్నారు. గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహోరా ఆధ్వర్యంలో కార్యాలయంలో శ్రద్ధాంజలి ఘటించారు. జాతిపిత చిత్రపటానికి పూలమాలలు వేశారు.



బరంపురం: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొరాపుట్: నవరంగ్‌పూర్ కాంగ్రెస్ కార్యాలయంలో గాంధీ సంస్మరణ కార్యక్రమం



రాయగడ: సహీద్ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గమాంగో, నాయకులు



కొరాపుట్: నవరంగ్‌పూర్ కలక్టరేట్ వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



పర్లాకిమిడి: గాంధీ వర్ధంతి సభలో ఎమ్మెల్యే దాశరథి గమాంగొ

పార్టీకి తీరని లోటు

- రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి
- మంత్రి నవకిషోర్ దాస్‌కు నివాళులర్పించిన బీజేడీ శ్రేణులు

రాయగడ: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి నవకిషోర్ దాస్ ఆకాల మరణం పార్టీకి తీరని లోటని రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు అన్నారు. స్థానిక రాణిగుడ ఫారంలోని ఆయన నివాసంలో సంతాపసభ సోమవారం నిర్వహించారు. రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, బీజేడీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నెక్కంటి మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు నవదాస్ చేసిన కృషి వెలకట్ట లేనిదన్నారు. మహోన్నత వ్యక్తిని పార్టీ కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు.



రాయగడ: సంతాపం ప్రకటిస్తున్న నెక్కంటి భాస్కరరావు

అనుబంధాన్ని పంచుకున్న నాయకులు

కొరాపుట్: ఏఎస్ఐ తుపాకీ కాల్పులకు మృతి చెందిన మంత్రి నవదాస్‌కు చింతిస్తూ కొరాపుట్‌లోని చందన్ ఫాత్రీ సమీపంలో ఉన్న బీజూ పాతాఘర్ భవనంలో బీజేడీ నాయకులు సంతాప కార్యక్రమం నిర్వహించారు. నవదాస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, మౌనం పాటించారు. మంత్రితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, కొరాపుట్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్, పాట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలాటేందు రంజనౌతి ఉన్నారు.



హాజరైన బీజేడీ నాయకులు, కార్యకర్తలు



కొరాపుట్: ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పీతం పాఢి, చిత్రంలో పాణిగ్రాహీ, ఎమ్మెల్యేలు

ఫెన్సింగ్ పోటీల్లో పతకాల పంట

గుమ్మలక్ష్మీపురం: కర్నూలు జిల్లా మొంటెస్సోరిలో ఈనెల 27, 28, 29వ తేదీల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన విద్యార్థులు రాణించారు. పతకాలు సాధించారు. బాలికలు అండర్-17 విభాగంలో తోయక ప్రవళిక (భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్) రజత పతకం(ఇప్పీ), బాలుర అండర్-17 విభాగంలో కొండగొర్రి నవదీప్ (గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల) కాంస్య పతకం(సెబర్), బాలుర అండర్-14 విభాగంలో సీమల విష్ణు (గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల)కాంస్య పతకం(ఫోయిల్) సాధించారు. వీరికి కోచ్‌గా పత్తిక బాలరాజు, కోన కిరణ్ వ్యవహరించారు. విద్యార్థులను కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల పీడీ నిమ్మక మాధవరావు అభినందించారు.

వేగవంతంగా గృహ నిర్మాణాలు

పార్వతీపురం: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, భూముల రీసర్వే, భూసేకరణ, మ్యూటేషన్, జాతీయరహదారులు, ఈ-క్రాప్, పీఎం కిసాన్, బిందు సేద్యం, జగనన్న పాలవెల్లువ, వైఎస్సార్ చేయూత, గృహనిర్మాణం తదితర ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యాల సాధనపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సోమవారం మాట్లాడారు. జిల్లాకు కోటి నలభై లక్షల పనిదినాలు కల్పించినట్టు వెల్లడించారు. జిల్లాలో 4,87,000 మంది జాబ్ కార్డుదారులు ఉండగా, 2,40,000 మంది మాత్రమే పనుల్లో పాల్గొంటున్నారన్నారు. కనీస వేతనం 220లు రావాల్సి ఉండగా, ప్రస్తుతం రూ.140 నుంచి రూ.150లు వస్తోందని తెలిపారు. జేసీ ఒ.ఆనంద్, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీఓలు సి.విష్ణుచరణ్, బి.నవ్య, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్డీఓ కె.హేమలత, డీఈఓ ఎస్‌డీవీ రమణ, పీఆర్ఎస్ఈ ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రభాకరరావు, హౌసింగ్ పీడీ రఘురాం, డుమా పీడీ రామచంద్రావు పాల్గొన్నారు.

అండర్-19 జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-19 బాల, బాలికల కబడ్డీ పోటీల్లో తలపడనున్న జిల్లా జట్ల ఎంపిక సోమవారం పూర్తయ్యాయి. అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 24 మంది క్రీడాకారులను బాల, బాలికల జట్లకు ఎంపిక చేశారు. మరో 8 మంది క్రీడాకారులకు స్టాండ్‌బైలుగా అవకాశం కల్పించినట్టు అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ తెలిపారు. ఎంపిక పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, బొమ్మన రామారావులతో పాటు పీడీలు కె.తౌడుబాబు, గోపాల్, ఎం.ఉదయ్ పర్యవేక్షించారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

భక్త గిరి

- కనుల పండువగా మరియగిరి యాత్ర
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తజనం
- కులమతాలకు అతీతంగా పూజలు
- మరియమ్మ స్తోత్రంతో మారుమోగిన గిరి

వీరఘట్టం:

శ్రీకాకుళం మేత్రాసన పాలక పునీతురాలు, క్రైస్తవుల సహాయమాత.. భక్తుల కొంగుబంగారం మేరీమాత మహోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. వేలాదిమంది భక్త జనం రాకతో మరియగిరి మురిసిపోయింది. వీరఘట్టం సమీపంలోని యు.వెంకమ్మపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన మరియమ్మకు హైదరాబాద్ మహా పీఠాధిపతి కార్డినల్ బిషప్ పూల ఆంథోనీ, శ్రీకాకుళం మేత్రాసనం పీఠాదిపతి రాయరాల విజయకుమార్‌ల ఆధ్వర్యంలో దివ్యపూజలు సాగాయి. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి సుమారు 30 వేల మంది భక్తులు దివ్యపూజలో పాల్గొన్నారు. మరియగిరి కొండపై ఉన్న మేరీమాతను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ప్రార్థనలు చేశారు. కొందరు మరియగిరి కొండపైకి మోకాళ్లతో నడుచుకుంటూ వెళ్లి మేరిమాతను దర్శించుకున్నారు. వీరఘట్టం, చిట్టపుడివలస, సివిని, పార్వతీపురం, బెలగాం, గరుగుబిల్లి, తూడి, పాలకొండ, వంగర, తలవరం, సంకిలి, నవగాం, పాలవలస గురుమండలాల్లో ఇటీవల నిర్వహించిన బైబిల్ పోటీలు, ఆటల పోటీల్లో విజేతలకు క్రైస్తవ పెద్దల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

గట్టి బందోబస్తు..

మరియగిరి యాత్రకు గతేడాది కంటే రెండింతలు భక్తులు ఎక్కువగా రావడంతో పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు, సీఐ మురళీధర్ పర్యవేక్షణలో వీరఘట్టం, సీతంపేట, దోనుబాయి ఎస్ఐలు ఎం.హరికృష్ణ, నీలకంఠేశ్వరరావు, రవివర్మలు తమ సిబ్బందితో కలిసి బందోబస్తు విధులు నిర్వహించారు. వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడిపారు.



కొండపై గర్భగుడిలో పూజలందుకుంటున్న మేరిమాత



మేరిమాతను దర్శించుకునేందుకు తండోపతండాలుగా వస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) దివ్యపూజలో ప్రార్థన చేస్తున్న కార్డినల్ బిషప్ పూల ఆంథోనీ



దివ్యపూజలో అధిక సంఖ్యలో పాల్గొన్న క్రైస్తవ భక్తులు

మహిమగల తల్లి మరియమ్మ

వీరఘట్టం: మహిమ గల తల్లిగా మరియమ్మ భక్తుల హృదయాల్లో కొలువుదీరి ఉన్నారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మరియగిరి మహోత్సవం సందర్భంగా సోమవారం మేరిమాతను దర్శించుకుని కొండపై గర్భగుడిలో వెలసిన మేరీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో మరియగిరి యాత్రకు ఓ ప్రత్యేక స్థానం ఉందని, ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. మేరిమాతను దర్శించుకున్న భక్తులకు మానసిక ప్రశాంతత చేకూరుతుందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా భక్తులు వచ్చి మేరిమాతను దర్శించుకొని, మొక్కులు చెల్లించడం ఆనందదాయకమన్నారు. అనంతరం కార్డినల్ బిషప్ పూల ఆంథోనీ, శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి విజయకుమార్‌లు ఎమ్మెల్యే జోగులు,ఎమ్మెల్సీ విక్రాంత్‌లను ఆశీర్వదించారు. అంతకు ముందు వీరు మరియగిరి కొండపై టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.



కార్డినల్ బిషప్ ఆంథోనీ, విజయకుమార్‌లతో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

డీఆర్సీ సమావేశం వాయిదా

విజయనగరం అర్బన్: కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన జిల్లా సమీక్ష సమావేశం వాయిదా పడినట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు సూచనల మేరకు వాయిదా వేసినట్టు వెల్లడించారు. సమావేశం జరిగే తదుపరి తేదీని మళ్లీ ప్రకటిస్తామన్నారు.

హైవే పనుల పరిశీలన

కొత్తవలస రూరల్: కొత్తవలస మండలంలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను ఆర్డీఓ సూర్యకళ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెందేరు, గులివిందాడ, చీపురువలస, వీరభద్రపురం, రాయపురాజుపేట గ్రామం గుండా వెళ్తున్న రహదారి పనులను నేషనల్ హైవే పీడీ రోహిత్‌తో కలిసి చర్చించారు. నోటిఫికేషన్‌లో పడని సర్వే నంబర్లు ఏవైనా ఉంటే తెలపాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవులపల్లి ప్రసాదరావు, ఆర్ఐ దివ్యకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టరహిత సమాజాన్ని నిర్మిద్దాం

- అవగాహన పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ సూర్యకుమారి



ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: కుష్టురహిత సమాజాన్ని నిర్మిద్దామని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఏటా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు 15 రోజులపాటు కుష్టు వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'స్పర్స్ లెప్రసీ అవగాహన ప్రచార కార్యక్రమం' నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్లను స్పందన కార్యక్రమంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆడిటోరియం బయట ఏర్పాటు చేసిన ప్రచార పోస్టర్‌పై కలెక్టర్ సంతకం చేశారు. కార్యక్రమంలో కుష్టు, ఎయిడ్స్, క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ జె.రామేశ్వరి ప్రభ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాల్లో జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఆన్‌లైన్ పద్ధతిలో కొనసాగుతున్నాయి. రెండు కేంద్రాల్లో రెండు షిఫ్టుల్లో సజావుగా సోమవారం పరీక్షలు జరిగాయి. చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్ట్‌లో 173 మందికి 172 మంది హాజరు కాగా, ఒక్కరు గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 128 మందికి 126 మంది హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్ట్‌లో 100కి 99 మంది హాజరు కాగా ఒక్కరు గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 100కి 99 మంది హాజరు కాగా, ఒక్కరు గైర్హాజరయ్యారు.

నేటి నుంచి వెంకన్న తిరుక్కల్యాణోత్సవాలు


పూజలందుకుంటున్న లోళ్లపుట్టుగ కల్యాణ వేంకటేశ్వరస్వామి

కవిటి: మండలంలోని లోళ్లపుట్టుగలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి 42వ తిరుకల్యాణోత్సవాలు, 53 వ సుప్రభాత వార్షికోత్సవం మంగళవారం నుంచి గురువారం వరకు జరగనున్నాయి. 31న సుప్రభాత సేవ, అభిషేకం, అర్చన, దీక్షాధారణ తదితర విశేష పూజలు నిర్వహిస్తారు. తొలిరోజు నుంచి చివరి రోజు వరకు ప్రతిరోజూ సాయంత్రం 3 గంటలకు ఎంవీ సింహాచలశాస్త్రి భాగవతార్ హరికథా గానం ఉంటుంది. శనివారం సత్యనారాయణ స్వామి వ్రతం, అన్న ప్రసాద వితరణ, చివరి రోజు పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు


ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణ

సరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను 6 వ తరగతిలో ప్రవేశ దరఖాస్తులు గడువు ఫిబ్రవరి 8 వరకు పొడిగించినట్లు విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డీవీ రమణ సోమవారం తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా నవోదయ వెబ్‌సైట్‌లో మాత్రమే పంపాలని తెలిపారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆదిత్యుడి సన్నిధిలో శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ వీసీ


రామకృష్ణారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని అనంతపురం జిల్లా శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎం.రామకృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. స్వామి ఆశీర్వచనాన్ని అందజేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టతను శంకరశర్మ ఆయనకు వివరించారు.

3న గార వైస్ ఎంపీపీ ఎన్నిక

అరసవల్లి: గార మండల పరిషత్ ఉపాధ్యక్ష స్థానానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి మూడో తేదీ ఉదయం 11 గంటలకు గార మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీతో పాటు మిగిలిన సభ్యులందరితో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, ఉపాధ్యక్ష స్థానాన్ని ఎంపిక చేసుకునేలా షెడ్యూల్ ప్రకటించారు. ఇదిలావుంటే గార వైస్ ఎంపీపీగా పనిచేసిన బరాటం రామశేషు ఇటీవల హత్యకు గురయ్యారు. దీంతో ఎన్నిక అనివార్యమైంది.

ధాన్యం దగ్ధం


కాలిపోయిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: రైతు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటన రట్టిణి గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన రైతు తనయ పాత్రో ఎకరా పొలంలో సాగుచేసిన వరిని నూర్పు చేసి.. ధాన్యాన్ని కళ్లానికి ఆనుకొని ఉన్న పొలంలో భద్రపరిచారు. అయితే అగ్ని ప్రమాదం చోటుసుకోవడంతో సుమారు 17 బస్తాల ధాన్యం కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ మనీషా ప్రమాద స్థలాన్ని సందర్శించి కాలిపోయిన ధాన్యాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

ఉత్సవ రంగం

ఉత్సాహ తరంగం

జిల్లాలో జాతరల జోష్

కాళీయ మర్దన వేణుగోపాలుని రాక కోసం వంశధార ఎదురు చూస్తోంది. మూడు నామాల వాడి వేయి నామాల స్మరణ వినేందుకు సుమంచ పాండవుల మెట్ట నిరీక్షిస్తోంది. మొక్కులు తీర్చే భక్తుల రాకకోసం రాములమ్మ పేరంటాళ్ల కోవెల ముస్తాబయ్యింది. ఒకటా రెండా.. ఊరూరా.. వాడవాడనా వైష్ణవ క్షేత్రాలు ఉత్సవాలకు సిద్ధమవుతున్నాయి. భీష్మ ఏకాదశి నాడు వైకుంఠధాముని కొలిచి మొక్కేందుకు కోవెలలు సర్వసన్నద్ధమయ్యాయి.



నమ్మకాల పుట్ట.. ఈ గుట్ట..

గార: శ్వేతగిరిపై వేంచేసిన కాళీయ మర్దన వేణుగోపాలస్వామి యాత్రకు శాలిహుండం ముస్తాబైంది. మాఘశుద్ధ ఏకాదశి(భీష్మ ఏకాదశి)ని పురస్కరించుకొని ఏటా నిర్వహించే ఈ యాత్రకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ నెల 31న అర్ధరాత్రి స్వామికి క్షీరాభిషేక సేవ అనంతరం ఫిబ్రవరి 1వ తేదీన వంశధార నదిలో స్వామి ఉత్సవ మూర్తులకు చక్రతీర్థ స్నానముంటుంది. 5వతేదీ మాఘ పౌర్ణమి రోజున కొండమీద తిరుక్కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ఈ ఆలయాన్ని క్రీస్తు శకం నాలుగో శతాబ్దంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.



వరదపాశం:
కొండపైన కాళీయ మర్దన వేణుగోపాల స్వామి ఆలయ సమీపంలో వరదపాశం ఉంది. జిల్లాలో కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు ఈ రాయి వద్ద పాయసాన్ని నైవేద్యంగా సమర్పించి జలాభిషేకం చేస్తే వర్షాలు కురస్తాయని భక్తుల నమ్మకం.



రాళ్లు పేరిస్తే..
ఆలయ పరిసరాల్లో మీరు నిశితంగా గమనిస్తే ఒకదానిపై మరొకటి పేర్చిన రాళ్ల విశేషంగా ఆకర్షిస్తాయి. ఇలా మూడు రాళ్లను పేర్చి స్వామిని కొలిస్తే కల్యాణ యోగం, సంతాన యోగం, గృహయోగం మూడు కలుగుతాయని భక్తుల నమ్మకం



సారంగం:
కొండపైకి వెళ్లే మార్గంలో శివాలయం మలుపు వద్ద కొంచెం కిందకు దిగితే పెద్ద రంధ్రం కనిపిస్తుంది. ఇదే సారంగం. పైకి మట్టితో నిండి ఉన్నా..లోపల సారంగ మార్గం ఉంది. కొంచెం దూరం వెళ్లిన తరువాత నీటితో నిండి ఉంటుందని స్థానికులు చెబుతున్నా రు. ఉత్సవాల సమయంలో ఈ నీటినే వినియోగిస్తారు. మరో విశేషం ఏమిటంటే ఈ సారంగ మా ర్గంలో కొబ్బరికాయలను వేస్తే నేరుగా శ్రీకూర్మంలోని ఆలయానికి చేరుతాయని చెబుతారు.


సిద్ధమవుతున్న బారికేడ్లు



మట్టి కుండల మర్మం..
భీష్మ ఏకాదశి సందర్భంగా స్వామిని దర్శించే భక్తులు వడపప్పు పానకం తీసుకొచ్చి నైవేద్యంగా సమర్పిస్తారు. చిన్న కుండల్లో వీటిని తీసుకురా వడం..సమర్పణ అనంతరం అక్కడే వదిలేయడం అవి అలా మట్టిలో కలిసిపోవడం పర్యావరణ హితమైన ప్రక్రియని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.




కోరిక తీరితే గెలకట్టాల్సిందే..
స్వామి సన్నిధికి వచ్చిన భక్తులు తమ కోర్కెలు తీరితే గర్భాలయానికి ఎదురుగా అరటిగెలలను కట్టి మొక్కు తీర్చుకోవడం ఇక్కడ సంప్రదాయం. అందుకే ఆలయ ప్రాంగణంలో వేలాడదీసిన అరటి గెలలు కనిపిస్తాయి.

జాతరకు వచ్చే భక్తులు సంఖ్య: 80,000 మంది

ఎలా వెళ్లాలి..
- శ్రీకాకుళం నగరం నుంచి శ్వేతగిరి 19 కిలోమీటర్లు.
- శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి భైరి రోడ్డు మీదుగా గార వైపు వెళ్లే రోడ్డు గుండా శాలిహుండం చేరుకోవచ్చు.
- పాతబస్టాండ్ నుంచి ఒప్పంగి.. సతివాడ మీదుగా కూడా వెళ్లవచ్చు.
- ఆటోలు, బస్సులు సదుపాయం ఉంది.
- కొండపైకి వాహనాలను అనుమతించడం లేదని సీఐ ఎల్. సన్యాసినాయుడు తెలిపారు.
- శ్రీకాకుళం నుంచి వచ్చే బస్సులు, వాహనాలను పూసర్లపాడు వద్ద, గార మీదుగా వాహనాలు బోరవానిపేట వరకూ అనుమతిస్తామన్నారు.
- మెట్ల మార్గం ద్వారా కొండకు వెళ్లి స్వామి వారిని దర్శనం చేసుకున్న తర్వాత ఘాట్ రోడ్ గుండా కిందికి దిగాలని పోలీసులు సూచించారు.
- ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అనువంశిక ధర్మకర్త సుగ్గు మధురెడ్డి తెలిపారు.

పాండవుల మెట్టపై..


టెక్కలి మండలం భగవాన్‌పురం సమీపంలో సుమంచపాండవుల మెట్ట

టెక్కలి: టెక్కలిలోని పాండవుల మెట్టపై బుధవారం భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహించేందుకు సర్వం సిద్ధంచేశారు. భగవాన్‌పురం గ్రామం సమీపంలోని పంచ పాండవుల మెట్టకు ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. ఏటా భీష్మా ఏకాదశి రోజున జరిగే ఉత్సవానికి చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారంతా ఇక్కడకు వచ్చి పూజలు చేస్తారు. త్రేతాయుగంలో రాముడు తన సైన్యంతో ఇక్కడకు వచ్చారని, ద్వాపరంలో పాండవులు ఇక్కడ విడిచి చేశారని స్థానికులు నమ్ముతారు. ఈ మెట్టపై ఇప్పటికీ భీముడు, నకుల సహదేవులు, కుంతీ, ధర్మరాజు, అర్జునుడు అప్పట్లో విడిది చేసిన గుహలు కనిపిస్తాయి. వీటితో పాటు అద్భుతమైన వన మూలికలు కలిగిన మెట్టగా పరిగణిస్తారు. 1950లో నేపాల్ రాజ వంశానికి చెందిన బాలకృష్ణానందా గిరిబాబా మహారాజ్ తన దేశ పర్యటనలో భాగంగా ఈ పాండవుల మెట్టకు చేరుకుని ఇక్కడే స్థిరపడ్డారు. ఆ తర్వాత ఎంతో మందికి వన మూలికలతో వైద్య సేవలు అందజేస్తూ ఇదే మెట్టపై జీవ సమాధిగా మారినట్లు శిష్యుడు నిరంజనానంద గిరిబాబా తెలియజేశారు.

అయ్యవారికి అరటి గెలలు

టెక్కలి: సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రలో భీష్మ ఏకాదశి నాడు జరిగే అరటి గెలల ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ గ్రామంలో ప్రతీ ఇంట్లో నిర్వహించే శుభకార్యానికి మునుపు పరవస్తు అయ్యవారికి మొదట పూజలు నిర్వహించి ఆ తర్వాత శుభకార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబంలో సమస్యలు లేకుండా కోరిన కోర్కెలు తీరాలని ముందుగా పరావస్తు అయ్యవారు శ్రీ లక్ష్మీ నృసింహాస్వామిని నమ్మకంగా తలచుకుంటే ఆ కోరికలు తీరుతాయనే నమ్మకం భక్తుల్లో బలంగా ఉంది. బుధవారం నుంచి రెండు రోజుల పాటు పరవస్తు అయ్యవారి సన్నిధిలో భీష్మా ఏకాదశి ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు.


చెట్లతాండ్ర గ్రామంలో పరవస్తు అయ్యవారు శ్రీ లక్ష్మీ నృసింహాస్వామి ఆలయం సింహద్వారం

యాభై ఏళ్ల సంప్రదాయం

నరసన్నపేట: భీష్మ ఏకాదశి సందర్భంగా గోపాలపెంటలోని రాములమ్మ పేరంటాల మండపం ఉత్సవానికి సిద్ధమవుతోంది. యాభై ఏళ్లుగా ఇక్కడ ఈ పండగ నిర్వహిస్తున్నారు. అరటి గెలలు, కొత్త చీరలను పేరంటాళ్లకు భక్తులు సమర్పిస్తారు. నరసన్నపేట ప్రాంతం నుంచే కాకుండా విజయనగరం, పర్లాకిమిడి, బరంపురంతో పాటు పాతపట్నం తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. వంశధార నదికి ఒక వైపు గోపాలపెంట ఉండగా మరో వైపు శాలిహుండం ఉంది. గోపాలపెంట మీదుగా వందలాది మంది భక్తులు శాలిహుండం కొండపై ఉన్న వేణుగోపాల స్వామిని దర్శించుకునేందుకు వెళ్లే ముందు గోపాలపెంటలోని రాములమ్మ పేరంటాల వద్ద మొక్కులు తీర్చుకుంటారు.


రాములమ్మ పేరంటాల మండపం వద్ద మొక్కులు తీర్చుకొనేందుకు భక్తులు కట్టిన అరటి గెలలు, చీరలు (ఫైల్)


నిద్దాలమ్మ తల్లి

నేటి నుంచి నిద్దాలమ్మ జాతర

జి.సిగడాం : మండలంలోని నిద్దాం గ్రామంలో వెలిసిన నిద్దాలమ్మ తల్లి యాత్ర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు మహిళలంతా ముఱ్ఱాటలతో తిరువీధి ఉత్సవం నిర్వహించి గ్రామంలోని అసిరితల్లికి చల్లదనం చేస్తారు. మూడో రోజుకూడా మహిళలు ప్రత్యేక పూజలు చేసి ముఱ్ఱాటలతో ఊరేగింపు నిర్వహిస్తారు.
- బుధవారం రాత్రి 1,56,000 దీపాలతో అమ్మవారిని ఆరాధించడం.. ఈ దీపోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావడం ప్రత్యేకత.

ఇలా వెళ్లాలి..
- చిలకపాలెం నుంచి రాజాం మార్గంలో 20 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- రవాణా సదుపాయం ఉంది.

దేశ సమగ్రతకే భారత్ జోడో యాత్ర

- డీసీసీ అధ్యక్షురాలు సత్యవతి

శ్రీకాకుళం అర్బన్: దేశ సమగ్రత, సమైక్యత కోసమే కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశం సమగ్రత, సమైక్యతతో ఉన్న తరుణంలో దేశ రాజకీయాల్లోకి ఆర్‌ఎస్‌ఎస్ విధానాలతో వచ్చిన బీజేపీ జాతులు, కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ రాజకీయ కుతంత్రాలు పన్నుతోందని విమర్శించారు.


వసంతకుమార్ మృతికి నివాళులర్పిస్తున్న నాయకులు

వట్టికి నివాళులు

మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని సత్యవతి అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకులు సనపల అన్నాజీరావు, పైడి నాగభూషణరావు, దేశేళ్ల గోవింద మల్లిబాబు, లఖినేన నారాయణరావు, కొత్తకోట సింహాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఔదార్యం


మరుగుదొడ్లు ప్రారంభం కార్యక్రమంలో కాంట్రాక్టర్ నారాయణ, కుటుంబ సభ్యులు

- జూనియర్ కళాశాలకు సదుపాయాల కల్పన

ఇచ్ఛాపురం: కాంట్రాక్టర్ గుజ్జు నారాయణ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని స్టేషన్ రోడ్డులో కొత్తగా నిర్మాణం చేసిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు 20 లక్షల రూపాయలతో వివిధ మౌలిక సదుపాయాలు కల్పించారు. 12 బ్లాక్‌లతో మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టారు. కళాశాల తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం, పరిసరాల్లో గ్రావెల్ ఫిల్లింగ్ చేసి ఆదర్శంగా నిలిచారు. ఇందులో భాగంగా నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను సోమవారం ప్రారంభించారు. 2019 లో రూ. ఒక కోటి నాలుగు లక్షలతో కళాశాల నిర్మాణం జరిగింది. అయితే మరుగుదొడ్లు లేకపోవడంతో వినియోగంలోకి రాలేదు. దీంతో కాంట్రాక్టర్ నారాయణ సొంత నిధులు వెచ్చించి తల్లిదండ్రులు గుజ్జు గంగాధర్‌రెడ్డి, సుందరమ్మ జ్ఞాపకార్థం మౌలిక సదుపాయలు కల్పించారు. కాగా నారాయణను కళాశాల ప్రిన్సిపాల్ రజనీకుమారి, కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు.

గాయపడిన వృద్ధురాలు మృతి

లావేరు: గ్యాస్ స్టౌపై వంట చేస్తుండగా సంభవించిన ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు మృతి చెందింది. లావేటిపాలెంలోని ఎస్సీ కాలనీకి చెందిన గంట్యాన అశిరమ్మ (70) ఈ నెల ఎనిమిదో తేదీన గ్యాస్ స్టౌపై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చేలరేగి ఆమెను అంటుకున్నాయి. తీవ్రంగా గాయపడిన అశిరమ్మను కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. ఈమెకు భర్త అప్పయ్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలియడంతో లావేరు–2 సచివాలయం వీఆర్వో టి.లక్ష్మణరావు, లావేరు పోలీసులు రిమ్స్ ఆస్పత్రికి చేరుకున్నారు. అశిరమ్మ మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం చేయించారు.

పశువుల అక్రమ రవాణా అరికట్టాలి


మాట్లాడుతున్న రామకృష్ణ

కోటబొమ్మాళి: పశువుల అక్రమ రవాణాపై పోలీసులు దృష్టిసారించాలని గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. అవసరమైతే కేసులు నమోదు చేసి శిక్షించాలని సూచించారు. కోటబొమ్మాళిలో వెటర్నరీ ఏడీ మంద లోకనాథం అధ్యక్షతన మండలంలోని పశువుల సంతల మానిటరింగ్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఇందులో పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశాల మేరకు సంతల్లో దాణా, తాగునీరు, నీడనిచ్చే చెట్లు, షెడ్లు వంటి మౌలిక సదుపాయాలు తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. నారాయణవలస సంతలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, జీపీఎస్ వాహనాల్లోనే పశువులను తరలించాలని కోరారు. ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ.. నారాయణవలస సంతలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 40 లక్షలు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడ కె.వి.ఆర్. సత్యన్నారాయణ, పశువైద్యులు ప్రజ్ఞచైతన్య, వెంకటేష్, ఆర్‌ఐ హరి, వెటర్నరీ సహాయకులు శాంతారావు, భానోజీరావు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ మీట్‌కు అంపైర్‌గా మాధవరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఖేలో ఇండియా జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు అంపైర్ (టెక్నికల్ అఫీషియల్)గా జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ) కె.మాధవరావు నియామకం అయ్యారు. ఈ మేరకు ఇండియన్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని భూపాల్ వేదికగా మంగళవారం నుంచి ఫిబ్రవరి ఐదో తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. గతంలో పలు జాతీయ, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా, మేనేజర్‌గా మాధవరావు వ్యవహరించారు. ఈయన శ్రీకాకుళంలోని బలగ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో పీడీగా పనిచేస్తున్నారు. అంపైర్‌గా నియామకం కావడంపై డీఈఓ జి.పగడాలమ్మ, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు కె.మధుసూదన్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి హర్షం వ్యక్తం చేశారు.

ఆకలైన వేళ ఆశ్రయం




ఉద్దానంలో ఓ వైపు ఎలుగులు ఊళ్లపై దాడులు చేస్తూ భయపెడుతున్నాయి. ఇది ఒక కోణమైతే ఓ ఎలుగు పిల్లను స్థానికులు చేరదీసి పాలుపోసి లాలించడం మరో కోణం. తల్లి నుంచి విడిపోయిన ఎలుగు పిల్లలు బహడపల్లి పంచాయతీ నల్లబొడ్లూరు గ్రామానికి వచ్చేశాయి. దీంతో ఆ పిల్లలను స్థానికులు చేరదీశారు. అవి ఆకలితో ఉండడంతో నీరు, పాలు పట్టారు. అనంతరం తోటల్లోకి తీసుకెళ్లి వాటిని విడిచిపెట్టారు. – మందస

కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష తగదు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష ఉండరాదని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకూ స్పర్శ లెప్రసీపై నిర్వహించే అవగాహన కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాను కుష్టు వ్యాధి నుంచి విముక్తి చేయడానికి ఉన్న ఏ అవకాశాన్ని వదులుకోమన్నారు. ఈ వ్యాధిని సులభంగా గుర్తించి చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ప్రారంభ దశలోనే కనుక్కోవాలని సిబ్బందికి సూచించారు. వ్యాధిగ్రస్తులపట్ల ఎలాంటి వివక్ష చూపమని, ఎవరైనా వివక్ష ప్రదర్శించటాన్ని చూస్తే అంగీకరించమని అధికారులందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనూరాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కమ్మసిగడాం జాతర ప్రారంభం

- మహాలక్ష్మీతల్లి కల్యాణంతో శ్రీకారం

రణస్థలం: కమ్మసిగడాంలోని మహాలక్ష్మీతల్లి జాతర మహోత్సవం సోమవారం రాత్రి ప్రారంభమైంది. రాత్రి 9.55 గంటలకు బంటుపల్లికి చెందిన వేలిచేటి కుటుంబీకులు అమ్మవారిని పల్లకిలో ఉరేగింపుగా తీసుకొచ్చి కల్యాణం జరిపించడంతో జాతరకు శ్రీకారం చుట్టారు. మహాలక్ష్మీతల్లి కన్నవారైన చీపురుపల్లి మండలం పెదనడిపిల్లి చెందిన ఎరిమెని కుటుంబీకులు తాళిబొట్టు, చీర, పసుపు, కుంకుమ, సారెలు తీసుకొచ్చారు. అలాగే అత్తవారి గ్రామమైన సంచాం నుంచి భర్త బొట్ల గుజప్పదొర కుటుంబీకులు మేళ తాళాలతో హాజరై సంప్రదాయ బద్ధంగా చుట్టుపక్కల ప్రజలందరూ కలిసి అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించగా.. ఈ దృశ్యాన్ని ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు తిలకించి తరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి.


మహాలక్ష్మీతల్లి కల్యాణం జరిపిస్తున్న వెలిచేటి కుటుంబీకులు